క్లుప్తంగా

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలిగా మంజుల



మంజులకు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ: బీఆర్ఎస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షురాలిగా నవభారత్‌కు చెందిన భట్టు మంజుల నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, కాల్వ ప్రకాశ్‌రావు, దాసరి నాగేశ్వరరావు, కాసుల వెంకట్, బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శిగా కుశనాయక్



పాల్వంచ: లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాల్వంచకు చెందిన గుగులోతు కుశనాయక్ నియామకం అయ్యారు. ఈనెల 8న పట్టణంలోని బంజారా భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కుశనాయక్ మాట్లాడుతూ.. సంఘ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కోడ్ అమలుపై నిర్లక్ష్యం



కిన్నెరసానిలో ముసుగు వేయని ఎన్టీఆర్ విగ్రహం

పాల్వంచరూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24గంటలు దాటినా అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని కిన్నెరసానిలో ఎన్టీఆర్ విగ్రహనికి మంగళవారం సాయంత్రం వరకు కూడా ముసుగు లేయలేదు. ఇక ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫొటోలతో కూడిన పోస్టర్లు కూడా తొలగించ లేదు.

భారత జాగృతి జిల్లా అధ్యక్షురాలిగా మాధవీలత



నియామకపత్రం అందజేస్తున్న పవన్

కొత్తగూడెంఅర్బన్: భారత జాగృతి సంస్థాగత నిర్మాణంలో భాగంగా సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రెంటపల్లి మాధవీలతను జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా ఆమెకు జాగృతి జిల్లా అధ్యక్షుడు బానోత్ పవన్‌నాయక్ నియామకపత్రాన్ని అందజేశారు. పవన్‌నాయక్ మాట్లాడుతూ.. సంస్థ బలోపేతానికి, ఆశయాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం కొత్తగూడెం డివిజన్ ప్రధాన కార్యదర్శి బానోత్ జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం అన్నారుపాడులో పీవైఎల్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను యువకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూక్యా చందు, బానోత్ వీరన్న, హాతిరామ్, ఈశ్వర్, రమేష్, విశాల్, కల్యాణ్ పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయండి

సుజాతనగర్: మండల కేంద్రలో నూతన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో ఒక్క వీధి లైటు కూడా లేదు. డబుల్ బెడ్ రూం గృహాలకు సమీపంలో సుమారు రూ.2 కోట్లు వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఇటీవలే ప్రారంభించారు. ఈ మార్గంలో గతంలోనే బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి పూట ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటా జ్వర పీడితులే..

- ఒకరికి వస్తే...ఆపై ఇంట్లో అందరికీ
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

సుజాతనగర్: మండల వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఇంట్లో జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, బాడీ పెయిన్స్‌తో విలవిల్లాడుతున్నారు. విషజ్వరాల ప్రభావంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలలాడుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధులు అధికం కాగా డెంగీతో రక్తకణాలు తగ్గడం సమస్యగా మారుతోంది. స్థానిక ప్రభుత్వాస్పత్రులలో ప్రతిరోజూ వందల సంఖ్యలో ఓపీ నమోదవుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వందల సంఖ్యలో ఓపీ..

సుజాతనగర్ మండల కేంద్రంతో పాటు, పరిసర గ్రామాల్లో రోజురోజుకు విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావంతో ఆస్పత్రిలో ప్రతిరోజూ 120 – 150 మందికి పైగా ఔట్ పేషెంట్లు వస్తున్నారు. వీరిలో మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఉన్నప్పటికీ పరీక్షల్లో నెగెటివ్‌గా నిర్ధారణ అవుతోంది. వాతావరణంలో మార్పులు, కలుషిత నీటితో ప్రజలు వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. వారం రోజులుగా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. ఇప్పటికే పీహెచ్‌సీ పరిధిలోని సర్వారం, బాబూక్యాంపు, రాంనగర్, విద్యానగర్‌లో నాలుగు డెంగీ కేసులు నమోదు కాగా పరిసర ప్రాంతాలను శానిటేషన్ చేసినట్లు వైద్యులు తెలిపారు. వారం నుంచి 250 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా అందులో 115 మందికి మలేరియా నిర్ధారణ అయింది.

ఐదు పడకలతో ఎలా..?

సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రిలో మొత్తం ఏడు బెడ్లు ఉండగా... ఇందులో రెండు బెడ్లు పిల్లల కోసం కేటాయించారు. మిగిలిన ఐదు బెడ్లతో వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన తరువాత సెలైన్ బాటిల్ పెట్టాల్సి వస్తే బెడ్‌పై ఉన్న రోగి డిశ్చార్జ్ అయ్యేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు అనుగుణంగా బెడ్ల సంఖ్యను పెంచకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు వస్తున్నా బెడ్ల సంఖ్య పెంచకపోవడం ఏంటని రోగులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది, మౌలిక వసతులు లేకపోవడంతో వైద్య సేవల్లో ఆలస్యం జరుగుతోంది.

రెండోసారి జ్వరం వచ్చింది



15 రోజుల క్రితం విపరీతమైన జ్వరం, జలుబు, దగ్గు వచ్చింది. ప్రభుత్వాస్పత్రికి వెళితే డాక్టర్లు చేర్పించుకుని మందులు ఇచ్చి గ్లూకోజ్ ఎక్కించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. అయితే తగ్గినట్లే తగ్గి మళ్లీ జ్వరం రావడంతో రెండోసారి ఆస్పత్రికి వచ్చారు.

– కత్తి శ్రీను, హరిజనవాడ

ఊళ్లో అందరికీ వస్తున్నాయి



రాత్రి నుంచి బాగా జ్వరం, వళ్లు నొప్పులు, నీరసంగా ఉంటోంది. ఏమీ తినాలనిపించడం లేదు. ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోగా సాధారణ జ్వరం అని చెప్పి జాయిన్ అవ్వమని చెప్పారు. ఊళ్లో అందరికీ జ్వరాలు వస్తున్నాయి. తగ్గే వరకు ఇక్కడే ఉంటా.

– వాసిరెడ్డి భవాని, సుజాతనగర్

వైరల్ ఫీవర్ కేసులే ఎక్కువ



వైరల్ కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. రక్తకణాలు తగ్గిన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం. సర్వారం, బాబూక్యాంపు, రాంనగర్, విద్యానగర్‌లో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వారు ఆరోగ్యంగానే ఉన్నారు.

– డాక్టర్ రమేష్, వైద్యాధికారి, సుజాతనగర్ పీహెచ్‌సీ

కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు

జూలూరుపాడు: కేంద్ర ఎన్నికల సంఘం ఐదు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ప్రకటించడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులోకి వచ్చింది. దీంతో జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫెక్సీలు, వాల్ పోస్టర్లు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్ తొలిగించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలు, పార్టీ దిమ్మెలకు ముసుగులు తొడుగుతున్నారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో వినోభానగర్ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి డిశంబర్ 3 ఎన్నికల ఫలితాలు వెల్లడించే వరకు కొనసాగనుంది.



టేకులపల్లిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.

రేపు వాహనాలకు లక్కీ డ్రా

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వివిధ విభాగాలు, గనులలో ఏసీ, నాన్ ఏసీ 11 అద్దె వాహనాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి లక్కీ డ్రా నిర్వహించటం జరుగుతుందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. మంగళవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. ఈ నెల 12న లక్కీ డ్రా తీసి వాహనాలను ఖరారు చేస్తామని తెలిపారు. వాహనదారులు సకాలంలో హాజరు కావాలని, లక్కీ డ్రాకు సహకరించాలని కోరారు.

నిర్లక్ష్యం తగదు



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలక భూమిక పోషిస్తున్న మైనింగ్, టెక్నికల్ సిబ్బంది పట్ల సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పేరుకే ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లుగా పేర్కొంటున్నారే తప్ప, తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదని ఏఐటీయూసీ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య ఆరోపించారు. మంగళవార ం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయం ఎదుట డిమాండ్ల పరిష్కారం కోరుతూ మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్ సబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో జి.వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, క్రిష్టాఫర్, గట్టయ్య, మధుకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి జేవీఆర్ సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెంరాజుకు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. కార్మికులకు కన్వీయన్స్, ఇన్సెంటివ్, డస్ట్ అలవెన్స్‌లు అందజేయాలని, లిఫ్ట్‌ల రిపేర్లను పరిశీలించి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. స్పందించిన ఏరియా జీఎం మీ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాగేందర్, ఈ.రమేష్, యశ్వంత్‌రెడ్డి, ఈ.ఈశ్వర్, ఏ.నగేష్, ఫిట్టర్ నగేష్ పాల్గొన్నారు.

ఎల్లలు లేని విప్లవకారుడు చేగువేరా



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన ఎల్లలు లేని విప్లవకారుడు చేగువేరా అని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ అన్నారు. కొల్లాపురం గ్రామంలో చేగువేరా వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రావూరి ఉపేందర్, లక్ష్మణ్, భరత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు వచ్చేదెప్పుడో..?



మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

ఇల్లెందు: యాదవులు, కురుమలకు రెండో విడత గొర్రెల యూనిట్లు ఇస్తామని డీడీలు తీసుకున్నారని, ఇప్పుడేమో ఎన్నికల కోడ్ వచ్చి ఏ పథకం జోలికి వెళ్లరాదని ఎన్నికల కమిషన్ ప్రకటించినందున యాదవుల పరిస్థితి దయనీయంగా మారిందని ఉమ్మడి జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులకు ఈ ప్రభుత్వం చేసింది తక్కువ, ప్రచారం ఎక్కువ అన్నట్లు మారిందన్నారు.

అప్పులు చేసి డీడీలు తీసిన యాదవులు లబోదిబోమంటున్నారని పేర్కొన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి రావాలనుకుంటున్న ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. సమావేశంలో పుట్టా ఉపేందర్ యాదవ్, రావుల ఐలయ్య యాదవ్, భిక్షపతి యాదవ్, కొమురయ్య, వీరస్వామి, వెంకటేష్, లింగరాజు, బండారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'ల సమ్మె తాత్కాలిక విరమణ

జూలూరుపాడు: నిరవధిక సమ్మెను తాత్కలికంగా విరమించి విధుల్లో చేరుతున్నట్లు ఆశా వర్కర్లు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ మాట్లాడుతూ.. హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు స్పందించి ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీ వేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు బి.నీలిమ, శారద, లక్ష్మి, వసుంధర, లక్ష్మీదేవి, భూక్యా రుక్మిణి, ఏసుమణి, కృష్ణవేణి, పద్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పారితోషకాలు వద్దు, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు 15 రోజులగా చేస్తున్న నిరవధిక సమ్మెను తాత్కాలికంగా విరమించారు. హెల్త్ డైరెక్టర్ హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సులానగర్ పీహెచ్‌సీలో వైద్యాధికారి దినేష్‌కు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు లేఖను అందజేశారు. మజహరి, చైతన్య, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.



జూలూరుపాడు: డాక్టర్ రాకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ద్వంద్వ నీతికి వ్యతిరేకంగా పోరాడుదాం..



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: సింగరేణిలో కొనసాగుతున్న ద్వంద్వ నీతికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. అండర్‌గ్రౌండ్‌లో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్లు, ఈపీ ఆపరేటర్లు, మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేజ్‌లో అదే ప్రదేశంలో జాబ్ ఇవ్వాలని ఏఐటీయూసీతో సహా అన్ని సంఘాలు 2021 సెప్టెంబర్ 25న యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసినట్లు చెప్పారు. 2022 ఏప్రిల్ 19న యూనియన్లతో ఒప్పందం చేసుకుని 90 రోజులలో కమిటీ వేసి వీటిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. కానీ ఆరు నెలలు గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగబోతున్నాయని, హడావుడిగా తొత్తు యూనియన్లను దగ్గర పెట్టుకుని సోమవారం సర్క్యులర్ లోపభూయిష్టంగా జారీ చేశారని పేర్కొన్నారు. తక్షణం తాము లేవనెత్తిన అన్ని సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు దాసరి రాజారామ్, సుందర్, సంజీవచారీ, గుగులోతు కృష్ణ, శ్రీనివాస్ మంచాల వెంకటేశ్వర్లు, పైడిరాజు, వెంకటేశ్వర్లు, సామ్యూల్, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



జూలూరుపాడు: మాట్లాడుతున్న సత్యప్రసాద్

టేకులపల్లి: అసెంబ్లీ ఎన్నికల నియమావళి విడుదల అయిన నేపథ్యంలో కోడ్ అమల్లో ఉంటుందని ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డిలతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ.50వేలకు మించి నగదు ఉంటే సరైన పత్రాలు చూపించాలని, మద్యం, బంగారం ఇతర ఆభరణాలకు కూడా తగిన ఆధార పత్రాలు చూపించాలని లేకపోతే కేసు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ పోలీస్ చెక్‌పోస్టును మంగళవారం వైరా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్, వైరా ఏసీపీ రెహమాన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున వాహనాల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని జూలూరుపాడు సీఐ శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో జూలూరుపాడు, ఏన్కూరు ఎస్‌ఐలు పురుషోత్తం, రవి, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కాంగ్రెస్ పార్టీకే ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, ఎబ్లాక్ అధ్యక్షుడు చావా వీరయ్య చౌదరి కాంగ్రెస్ పార్టీ అదిష్టానాన్ని కోరారు. మంగళవారం స్థానిక సూర్యపాలెస్ హోటల్ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉందన్నారు. అదేవిధంగా బీసీలకే ఇవ్వాలన్నారు. పార్టీ అధిష్టానం ఆలోచించి, సీపీఐతో పొత్తు లేకుండా కాంగ్రెస్ పార్టీకే టికెట్ కేటాయించాలన్నారు. సోషల్ మీడియాల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. సమావేశంలో బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, సకినాల వెంకటేశ్వరరావు, అంతోటిపాల్, పల్లపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం సాధిస్తుంది..

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఊకంటి గోపాల్‌రావు, తూము చౌదరి అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం తెలగ రామవరంలో మంగళవారం గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా పార్టీ తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారంగా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆళ్ల మురళి, త్రివేది, వేణుగోపాల్‌రావు, పద్మ, రజిని, ఉమ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిపించండి..

నవభారత్: కొత్తగూడెంలోని తెలంగాణ ఉద్యమకారుడిని ఎమ్మెల్యేగా గెలిపించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ కొత్తగూడెంలోని ఓటర్లను కోరారు. మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. నర్సయ్య మాట్లాడుతూ... 1969 నుండి 2014 తెలంగాణ రాష్ట్రం కోసం అనేక అవమానాలు, పోలీసు లాఠీల దెబ్బలు తిని జైలుజీవితాలను అనుభవించి మా కుటుంబాలను రోడ్డున పడేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. తెలంగాన ఉద్యమానికి కొత్తగూడెం పురిటిగడ్డ అని రానున్న ఎన్నికల్లో మా సత్తా చూపిస్తామన్నారు. 119 స్థానాల్లో ఉద్యమకారులు పోటీచేస్తున్నారని తెలిపారు. ధర్మానికి కట్టుబడి ఉంటానని, కొత్తగూడెం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు వలీబాబు, కృష్ణారావు, భాస్కర్‌రావు, ఏలూరి రాములు, సత్యనారాయణ సయ్యద్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సయ్య

24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలి



రైతులను తీసుకెళ్తున్న ఎస్‌ఐ రమణారెడ్డి

టేకులపల్లి: 24 గంటల విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టేకులపల్లి మండలం పి.కొత్తతండాకు చెందిన రైతులు టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేసి టేకులపల్లి సెంటర్‌లో ధర్నా చేశారు. కరెంట్ ఎప్పుడు ఉంటదో... ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వాపోయారు. పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని, ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలు చేతికి రాకుండానే నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఎస్‌ఐ రమణారెడ్డి, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న రైతులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కార్యక్రమంలో పి.కొత్తతండాకు చెందిన బాధిత రైతులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం



మాట్లాడుతున్న మధు

ఇల్లెందురూరల్: ఎన్నికలు వచ్చినప్పుడల్లా అధికార పార్టీ ప్రోద్బలంతో పోలీసులు న్యూడెమోక్రసీ కార్యాలయంపై దాడులు చేయడం రివాజుగా మారిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే మధు ఎక్కడంటూ మఫ్టీలో ఉన్న పోలీసులు కార్యాలయాన్ని చుట్టుముట్టి అన్ని గదులు తనిఖీ చేశారని చెప్పారు. గత ఎన్నికల సమయంలోనూ అక్రమంగా అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేశారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాతే వదిలేశారని గుర్తుచేశారు. నిత్యం ప్రజల కోసం, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న తమపై పోలీసులు ఎందుకు నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని ప్రశ్నించారు. తాము లీగల్‌గా ఉంటూ చట్టప్రకారం కార్యాలయం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సారి కూడా అధికార పార్టీ నేతల సహకారంతోనే తనను అరెస్టు చేసేందుకు పోలీసులు ఇప్పటి నుంచే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఏం జరిగినా అధికార పార్టీ నేతలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కార్యాలయంపై పోలీసుల దాడిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. సమావేశంలో మండల వెంకన్న, ముక్తి సత్యం, బండారు అయిలయ్య, ఉమర్, కందగట్ల సురేందర్, భట్టు ప్రసాద్, బానోత్ సంతు, వాంకుడోత్ శ్రీనివాస్, వాంకుడోత్ సరోజిని, ప్రకాష్, ఝాన్సీ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కల్వర్టు నిర్మించారు.. రోడ్డు మరిచారు

ఇల్లెందు మండలం బాలాజీనగర్ గ్రామపంచాయతీ బాలాజీనగర్‌లోని అధ్వానంగా ఉన్న ఓ వీధిలో మురుగుకాల్వకు అడ్డంగా కల్వర్టు నిర్మించారు. కానీ రహదారి నిర్మాణం విస్మరించారు. దీంతో నేటికీ ఈ రహదారి ప్రజలకు అసౌకర్యంగా ఉంటోంది. ప్రత్యామ్నాయంగా దూరమైనా ఇబ్బంది పడుతూ చుట్టు తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : నీలిమ, కార్యదర్శి, బాలాజీనగర్ గ్రామపంచాయతీ
సెల్ నెంబర్: 9346931114